మట్టెవాడ: కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ గోపి

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- చదువుపై దృష్టి సారించాలి
- తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలి
- అవగాహన కార్యక్రమంలో మట్టెవాడ సీఐ గోపి

మట్టెవాడ, సెప్టెంబర్ 11: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని మట్టెవాడ సీఐ తుమ్మ గోపి సూచించారు. మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు, సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించడం వల్ల ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని చెప్పారు. నేడు గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం పెరిగిందని, తద్వారా సమాజం పాడయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని విద్యార్థులు గ్రహించి, వ్యసనాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల ఆశయ సాధనతోపాటు చదువుపై దృష్టి పెట్టాలన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

గీసుగొండ: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ సెంటర్ అడ్వకేట్ శోభారాణి సూచించారు. కొమ్మాలలో బుధవారం గ్రామైక్య సంఘాలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు గృహహింసకు గురవుతున్నారని, అలాంటి వారు సఖీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ శోభ, వీవోల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో అవగాహన

ఖిలావరంగల్: గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ బొల్లికుంటలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఎఫ్ ఎంఎం సాంఘిక సేవా సమితి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో బాలలపై జరుగుతున్న వేధింపులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ ఇసంపల్లి సుదర్శన్, ఇన్‌చార్జి హెచ్ఎం పూల రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం

గిర్మాజీపేట: మానవ అక్రమ రవాణా నేరమని చైల్డ్ వెల్ఫేర్ చైర్‌పర్సన్ వసుధ అన్నారు. స్టేషన్‌రోడ్‌లోని కృష్ణాకాలనీ హైస్కూల్ విద్యార్థులకు ఆమె లైంగిక దాడులు, వేధింపులు, చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే, యాంటీ హ్యూమన్ యూనిట్(ఏహెచ్‌టీయూ) ఇన్‌స్పెక్టర్ వెంకన్న మానవ అక్రమ రవాణా, అవయవాల రవాణా, సైబర్ క్రైమ్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 1930 నంబర్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ ఎం గంప అశోక్‌కుమార్, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, మధుకుమార్, సీడబ్ల్యూ సీ మెంబర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమాజంలో అసమానతలను రూపుమాపాలి

ఖానాపురం: సమాజంలో బాలికలపై ఉన్న అసమానతలను రూపు మాపాలని ఏపీఎం కందిక సుధాకర్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని చైతన్య మండల సమాఖ్య కార్యాలయంలో యూనిసెఫ్ సహకారంతో స్నేహ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కౌమార దశలో ఉన్న బాలికలతో సంఘాలను ఏర్పాటు చేసి, వారికి మంచీచెడులను వివరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ డీసీపీయూ పద్మలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాధవి, వాసంతి, సీసీలు నూరిన్నిసా, కరుణ, సమాఖ్య అధ్యక్షురాలు కవిత, జ్యోతి, కృష్ణకుమారి, సంధ్య పాల్గొన్నారు.

17 కిలోల గంజాయి పట్టివేత

- భువనేశ్వర్ నుంచి మన్మాడ్‌కు తరలించేందుకు యత్నం
- వరంగల్ రైల్వేస్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న జీఆర్పీ పోలీసులు
- నలుగురు యువకుల అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ సురేందర్

ఖిలావరంగల్, సెప్టెంబర్ 11: వరంగల్ రైల్వేస్టేషన్‌లో బుధవారం గంజాయిని పట్టుకున్నట్లు వరంగల్ జీఆర్పీ సీఐ పీ సురేందర్ తెలిపారు. మహారాష్ట్ర పుణెకు చెందిన సోహెల్ షకీల్ఇనామ్‌దార్(26), అఫ్తాబ్ సమీర్(24), సాకిబ్ జిలానీషేక్ (25), అభిషేక్ తిక్కయ్యరెడ్డి వరంగల్ రైల్వేస్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై షోల్డర్ బ్యాగ్‌లతో అనుమానాస్పదంగా కనిపించారు. విధుల్లో ఉన్న జీఆర్పీ పోలీసులు బ్యాగ్‌లను తనిఖీ చేయగా, అందులో గంజాయి ప్యాకెట్లు లభించాయి. వెంటనే ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నలుగురిని అదుపులోకి తీసుకొని జీఆర్పీ స్టేషన్‌కు తరలించి పంచనామా నిర్వహించారు. నిందితులు భువనేశ్వర్‌లో 17.425 కిలోల గంజాయిని కొనుగోలు చేసి మన్మాడ్‌కు తరలించేందుకు బయల్దేరారు. వరంగల్‌లో రైలు దిగి మన్మాడ్ వెళ్లే రైలు కోసం వేచి ఉన్నారు. ఈ క్రమంలో వారిని పట్టుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్న ఆయన తెలిపారు. గంజాయి విలువ రూ. 4,35,625 ఉంటుందని, నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

గిర్మాజీపేట: గంజాయి విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు ఇంతెజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. కాజీపేట మండలం శాయంపేట తిరుమలరెడ్డినగర్‌కు చెందిన షేక్ రషీదా భిక్షాటన చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నది. ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో 15 రోజుల క్రితం బల్లార్షాకు వెళ్లి అక్కడ సలీం వద్ద అరకిలో గంజాయిని రూ. 3 వేలకు కొనుగోలు చేసి వరంగల్‌కు తీసుకొచ్చింది. గంజాయిని చిన్న ప్యాకెట్లుగా తయారు చేసిన రషీదా బుధవారం మండిబజార్‌లోని మద్రాసీ మసీదు వద్ద విక్రయించేందుకు సిద్ధమైంది. పెట్రోలింగ్‌లో ఉన్న సిబ్బందిని చూసి పారిపోతుండడంతో పట్టుకున్నారు. ఆమె వద్ద రూ. 6,250 విలువైన గంజాయి, రూ. 3,050 నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసి, నిందితురాలని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గణపతి నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

వర్ధన్నపేట: నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వర్ధన్నపేట, సెప్టెంబర్ 11: గణపతి నిమజ్జనోత్సవం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. మండల కేంద్రంలోని కోనారెడ్డి చెరువులో నిమజ్జన కార్యక్రమం పెద్ద ఎత్తున జరగనున్నందున ఏర్పాట్లను ఏసీపీ నర్సయ్య, తహసీల్దార్ విజయ్‌సాగర్, మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ, కమిషనర్ జోనా గణపతి విగ్రహాలను వేసే ప్రదేశాన్ని పరిశీలించారు. నిమజ్జనం రాత్రి సమయంలో జరగనున్నందున ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. క్రేయిన్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు.

నిమజ్జనాలు ప్రశాంతంగా జరగాలి

రాయపర్తి: మండలంలోని 40 గ్రామ పంచాయతీల పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అధికారులకు సూచించారు. తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎస్సై కొంగ శ్రవణ్‌కుమార్‌తో కలిసి మండలకేంద్రంలోని మంచి నీళ్ల చెరువుతోపాటు మైలారంలోని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువుల వద్దకు మైనర్లను అనుమతించొద్దన్నారు. జలాశయాల వద్ద కార్యదర్శులు, గ్రామాల ప్రత్యేకాధికారుల సారథ్యంలో పోలీసుల సహకారంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు వల్లె వినోద్‌కుమార్, పెంచల విజేందర్, పలు శాఖల ఉద్యోగులు మహ్మద్ అంకూస్, మహంకాళి యాకయ్య, చిర్ర మహేందర్, కారుపోతుల రాంచంద్రయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

సంగెం: నిమజ్జనానికి సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని పర్వతగిరి సీఐ రాజగోపాల్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను లెక్కించి ఏయే తేదీల్లో నిమజ్జనం అవుతుందో మండపాల నిర్వాహకుల ద్వారా తెలుసుకోవాలన్నారు. అనంతరం సంగెం, ఎల్గూర్ చెరువుల వద్ద నిమజ్జనం చేసే స్థలాలను తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, సీఐ రాజగోపాల్, ఎస్సై ఎల్.నరేశ్ సందర్శించారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

మందులను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటరమణ

చెన్నారావుపేట, సెప్టెంబర్ 11: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మందులను పరిశీలించారు. గ్రామాలు, తండాల్లో అనేక రకాల వ్యాధులు ప్రబలుతున్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ జ్వరాలు వచ్చిన గ్రామాల్లో ఎంపీడీవో, స్థానిక అధికారుల సహకారంతో దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మండల వైద్యాధికారి సరోజ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు

నల్లబెల్లి: విధుల్లో వైద్య సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని వైద్యాధికారి పోరిక రవీందర్‌నాయక్ హెచ్చరించారు. మండలంలోని రేలకుంట, నందిగామ గ్రామాల పరిధిలోని హెల్త్ సబ్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజలు పరిసరాల శుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో నల్లబెల్లి, మేడిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ. 30 లక్షల విరాళం

దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు అందించిన 'పరుపాటి'

దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్స్ అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి, సెప్టెంబర్ 11: మైలారంలోని సీతారామచంద్రస్వామి ఆలయ సమగ్రాభివృద్ధికి రూ. 30 లక్షల విరాళాన్ని ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, మైలారానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రకటించారు. ఈ మేరకు ప్రహరీ నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అలాగే, తన నివాసంలో 16 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు లేతాకుల మధుకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రంగు కుమార్, కాకన్న, పరుపాటి రాజిరెడ్డి, ఐరెడ్డి వెంకట్‌రెడ్డి, గబ్బెట బాబు, పాతాపురం భిక్షపతి, కోల అనిల్ కుమార్, వెంకటయ్య, సంది బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

దుగ్గొండి: మండలంలోని మల్లంపల్లి జడ్పీ హెచ్ఎస్‌లో విద్యార్థినులు అలేఖ్య, కీర్తనకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం భద్రమ్మ మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న రావుల దేవేందర్, కవాటి శ్రీనివాస్ లయన్స్ క్లబ్ వారి ఆర్థిక సహకారంతో ఇద్దరికి సైకిళ్లు అందించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కపాల్, మహేంద్రనాథ్, రఘు, సుధాకర్, రాజేశ్, కిషన్, పద్మ, నిర్మల, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

18న పీడీఎస్ బియ్యానికి వేలం

ఖిలావరంగల్, సెప్టెంబర్ 11: అవకతవకలు, అక్రమ రవాణాలో పట్టుబడిన పీడీఎస్ బియ్యానికి ఈ నెల 18న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 10,52,850 విలువైన 37,550 క్వింటాళ్ల బియ్యం వర్ధన్నపేట మండలస్థాయి గిడ్డంగి, సంగెం మండలం షాపూర్‌లోని వేంకటేశ్వర రైస్‌మిల్, నర్సంపేటలోని బాలాజీ రైస్‌మిల్, దుగ్గొండిలోని ఎం వెంకటేశ్వర్లు చౌకధరల దుకాణం, వరంగల్‌లోని మండలస్థాయి గిడ్డంగుల్లో భద్రపరిచినట్లు తెలిపారు. రేషన్‌షాపు డీలర్లు, రైస్ మిల్లర్లు, పీడీఎస్ కేసుల్లో ఉన్న వారు, పౌరసరఫరాల శాఖకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధం ఉన్న వారు బహిరంగ వేలంలో పాల్గొనేందుకు అనర్హులని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు నిర్ణయించిన ధరలో 10 శాతం ధరావతుగా వరంగల్ డీఎస్‌వో పేరున డీడీ తీసి, ఆధార్‌కార్డుతోపాటు వేలానికి హాజరు కావాలని కోరారు.

బ్రిడ్జిపై మట్టి తొలగింపు

గీసుగొండ, సెప్టెంబర్ 11: మనుగొండ–మచ్చాపురం గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జిపై ఇటీవల కురిసిన భారీ వర్షానికి మట్టి పేరుకుపోయి బురదమయంగా మారింది. దీంతో ప్రయాణికులు, రైతులు, వాహనదారులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. వారి అవస్థలను గుర్తించిన మనుగొండకు చెందిన కొమ్ము శ్రీకాంత్ తన సొంత ఖర్చులతో బుధవారం బ్రిడ్జిపై మట్టిని తొలగించారు. ప్రయాణికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పుల బాధతో తాపీమేస్త్రీ ఆత్మహత్య

కుమారుస్వామి(ఫైల్)

సంగెం, సెప్టెంబర్ 11: అప్పుల బాధతో తాపీమేస్త్రీ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తీగరాజుపల్లికి చెందిన నల్లతీగల కుమారస్వామి(54) తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. ఇంటి అవసరాలు, కుటుంబ పోషణ కోసం రూ . 10 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. తన కోడలుకు టైఫాయిడ్ రావడంతో కుమారస్వామి భార్య విజయ బుధవారం ములుగుకు వెళ్లింది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సూసైడ్ నోట్ రాసుకొని క్రిమిసంహారక మందు తాగాడు. కొంత సమయం తర్వాత ఇంటి పక్క వారు వచ్చి పిలువగా అతడు పలకపోవడంతో కిటికీలో నుంచి చూశారు. నురగలు కక్కి అప్పటికే మృతి చెందినట్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు.

వరద నష్టం అంచనాలను తక్షణమే సమర్పించాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్, సెప్టెంబర్ 11 : ఇటీవల నగరంలో కురిసిన భారీ వర్షాలతో జరిగిన నష్టం అంచనాలను రూపొందించి తక్షణమే అందజేయాలని మేయర్ గుండు సుధారాణి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో వరద నష్టం, తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల వర్షంతో గ్రేటర్‌లో దెబ్బతిన్న ఇళ్లు, రహదారులు, పైపులైన్ల నష్టం అంచనాలను డివిజన్ల వారీగా రూపొందించాలని సూచించారు. గ్రేటర్ పరిధిలో అన్ని డివిజన్లలో సమాంతరంగా తాగునీటి సరఫరా జరుగాలన్నారు. ముఖ్యంగా అండర్ రైల్వేగేట్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలోని ఇబ్బందులను అధిగమించాలన్నారు. రాంపూర్, ఎనుమాముల ప్రాంతాల్లో సంపుల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేయాలని సూచించారు. తాగునీటి సరఫరా సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా ధర్మసాగర్ ఫిల్టర్‌బెడ్‌లో ప్రత్యేకంగా జనరేటర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, రాజయ్య, ఈఈలు శ్రీనివాస్, మహేందర్, డీఈలు సంతోష్ బాబు, సారంగం, కృష్ణమూర్తి, రవికిరణ్, రంగారావు, శివానంద్, శ్యామ్‌మోహన్, రాజ్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

వరద నష్టం అంచనాలపై ఇంజినీర్లతో సమీక్షిస్తున్న మేయర్ గుండు సుధారాణి

స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

'పోరాట సర్వహక్కులు సీపీఐకే దక్కుతాయి'

ఖిలావరంగల్, సెప్టెంబర్ 11: తెలంగాణ సాయుధ పోరాటం సర్వహక్కులు సీపీఐకే దక్కుతాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. బొల్లికుంట సమీపంలోని సీపీఐ కాలనీ అంబేద్కర్‌నగర్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరగడానికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. నైజాం మూకలు చెలరేగి ప్రజలను చిత్రహింసలకు గురి చేశాయన్నారు. నాడు దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణకు రాలేదన్నారు. అనేక మంది పోరాటం ఫలితంగానే భారత్‌లో తెలంగాణ విలీనమైందన్నారు. బీజేపీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదన్నారు. నాటి పోరాట యోధుల విగ్రహాలను ట్యాంకుబండ్‌పై ఏర్పాటు చేయాలన్నారు.

ప్రజలు పరిశుభ్రత పాటించాలి

నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి

కరీమాబాద్, సెప్టెంబర్ 11: ప్రతి ఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి సూచించారు. బుధవారం 42వ డివిజన్‌లో ఆమె పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు పోషకాహారం సకాలంలో అందజేయాలన్నారు. కోడిగుడ్లు, బాలామృతంతోపాటు ప్రభుత్వం ఇచ్చే పోషకాహారాన్ని పరిశీలించారు.

'గ్రామీణ వైద్యులపై దాడులు ఆపాలి'

రాజ్‌కుమార్

దుగ్గొండి, సెప్టెంబర్ 11: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై వైద్యాధికారులు దాడులు ఆపాలని యూత్ పర్ స్వచ్ఛ్ దుగ్గొండి వ్యవస్థాపక అధ్యక్షుడు శానబోయిన రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో ప్రాథమిక చికిత్స అందిస్తున్న వైద్యులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, వారికి తగిన శిక్షణ ఇచ్చి ప్రజలకు సేవ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జిగా సారయ్యగౌడ్

సారయ్యగౌడ్‌కు నియామక పత్రం ఇస్తున్న కృష్ణయ్య

నర్సంపేట, సెప్టెంబర్ 11: బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జిగా సోల్తి సారయ్యగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బుధవారం తెలిపారు. ఈ మేరకు సారయ్యకు హైదరాబాద్‌లో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భట్టి శ్యామ్‌మాధవ్ పాల్గొన్నారు.

21న బిట్స్‌లో ఉత్సంగ్-2024

నర్సంపేట రూరల్, సెప్టెంబర్ 11: లక్నేపల్లిలోని బిట్స్ కళాశాలలో ఈ నెల 21న ఉత్సంగ్–2024 (వరంగల్ జోనల్ కాంగ్రెస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చైర్మన్ డాక్టర్ అంద్రు రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్లు(ఐఈఈఈ) హైదరాబాద్ సెక్షన్ విద్యార్థి కార్యకలాపాల కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగనుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ వీఎస్ హరిహరన్, బిట్స్ సెక్రటరీ డాక్టర్ జి.రాజేశ్వర్‌రెడ్డి, ఏవో సలేంద్ర సురేశ్, డాక్టర్ నారాయణ, మధుకుమార్ పాల్గొన్నారు.

ఇన్నర్‌రింగ్ రోడ్డును అడ్డుకుంటున్న రైతులు

ఇన్నర్ రింగ్‌రోడ్డు సర్వేను అడ్డుకున్న రైతులు

కాశీబుగ్గ, సెప్టెంబర్ 11: వరంగల్‌లోని 3వ డివిజన్ ఆరెపల్లి, పైడిపల్లిలో ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం రెవెన్యూ అధికారులు బుధవారం చేపట్టిన సర్వేను రైతులు అడ్డుకున్నారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా తప్పుడు మ్యాప్‌తో సర్వే చేస్తున్నారని బాధిత రైతులు ఆరోపించారు. తగిన నష్టపరిహారం ఇస్తేనే భూములు ఇస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నామసాని నాగరాజు, రామ్‌రెడ్డి, దినేశ్, జితేందర్, రవి, రాజేందర్, అమర్, శ్రీను, రాజేశ్వర రావు, శివ, సాయిరాం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

30న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

కాశీబుగ్గ, సెప్టెంబర్ 11: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన సభను జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అనురాధ, శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కాశీబుగ్గలో గంగుల దయాకర్ అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రజా కార్మిక వ్యతిరేక నూతన చట్టాలు, లేబర్ కోడ్స్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ నెల 25న రాష్ట్రవ్యాప్తంగా విస్తృతస్థాయిలో వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ ప్లీడర్‌గా పోతరాజు రవి

వరంగల్ లీగల్, సెప్టెంబర్ 11: వరంగల్ జిల్లా ప్రభుత్వ ప్లీడర్‌గా న్యాయవాది పోతరాజు రవిని నియమిస్తూ కలెక్టర్ సత్య శారద బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ ఈ బాధ్యతల్లో కొనసాగిన శ్యామ్ సుందర్ రావు గడువు ముగియడంతో ఆయన స్థానంలో తాత్కాలికంగా రవిని నియమించారు. గతంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కూడా సేవలందించిన రవి నియామకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

WANTED
English & Maths Lady Teachers for 1st to 5th Classes
SALARY
Rs.10,000/- to Rs.15,000/-
NEW RISING SUN HIGH SCHOOL
KOTHAWADA, WARANGAL
M: 8008273888

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

PLOT FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

★Hyd. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ మహేశ్వరం, ముచ్చర్ల, కందుకూరులో ప్లాట్లు, విల్లాలు, ఇండ్లు ఫర్ సేల్... మీ పిల్లల బంగారు భవిష్యత్తు... శ్రీశైలం హైవే. Cont: 8008091512.
NT-332647

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAY